క్లుప్తంగా

5న ఆటో డ్రైవింగ్ ఉచిత లైసెన్స్ మేళా

కెరమెరి: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఆగస్టు 5న దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యుడు పితా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం ఎంతో ప్రమాదమని, లైసెన్స్ లేకుండా ఆటో నడిపి ప్రమాదాలకు గురై బీమా వర్తించక ఎందరో నష్టపోతున్నారన్నారు. ఆటో డ్రైవర్ల కోసం ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ నాయక్ మేళా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

రేగులగూడలో వైద్య శిబిరం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రేగులగూడ గ్రామంలో ఎస్పీఎం, స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. మారుమూల గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడమే ఫౌండేషన్ లక్ష్యమని మిల్లు ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మిల్లు ప్రతినిధి తుమ్మ రమేశ్, సర్పంచ్ ఆత్రం రమేశ్, కార్యదర్శి రమేశ్, ఏఎన్‌ఎం లక్ష్మి, సిబ్బంది జయసింహ, తన్నీరు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన

తిర్యాణి: మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన సాత్విక్ అనే బాలుడికి దొరికిన హనుమంతుని విగ్రహాన్ని గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రతిష్టించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ దంపతులు విగ్రహ ప్రతిష్టాపన పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేళ్లు, భక్తులు పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా, అంబేద్కర్‌చౌక్‌లలో శుక్రవారం షీటీం ఆధ్వర్యంలో నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులపై తమకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ మోసాలు, బాల్యవివాహాల గురించి సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకాలు నిలిపివేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలోని 2023 -24 విద్యాసంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కరుణ ఇచ్చిన ఆదేశాలు నిలిపివేయాలని గెస్టు ఫ్యాకల్టీలు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏవో రఫత్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1940 మంది గెస్ట్ అధ్యాపకులు హైకోర్టును ఆశ్రయించగా 2023 -24 సంవత్సరానికి పాతవారిని కొనసాగించాలని, కొత్త వారిని నియమించరాదని తీర్పునిచ్చిందన్నారు. సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, సుస్మిత, రాంచందర్, రమేశ్, విలాస్, శరత్, యాకూబ్, కోటేశ్ పాల్గొన్నారు.

సవార్ల ఊరేగింపు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి, చేడ్వాయి గ్రామాల్లో సవార్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, నృత్యాలతో గ్రామాల్లో యువకులు సందడి చేశారు. సవార్ల బంగ్లా వద్ద భక్తులు మలీదాతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో బంగ్లా వద్ద సందడి నెలకొంది.

పీరీల ఉత్సవాలు కలిసిమెలిసి జరుపుకోవాలి

తిర్యాణి: పీరీల ఉత్సవాలను అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హనుమాండ్ల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మొహర్రం ఉత్సవాలు నిర్వహిస్తున్న పీరీల బంగ్లా స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పీరీల ఉత్సవాల అనంతరం రేకుల షెడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ చుంచు శ్రీనివాస్, రైతుబంధు సమితి అధ్యక్షుడు శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన న్యాయవాదులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా అదనపు కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దాసరి వేణును శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆసిఫాబాద్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో న్యాయవాదులు రజిహైదర్, కిషోర్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని లారీ చౌరస్తాలో ఓ యువకుడు శుక్రవారం రాత్రి గంజాయి మత్తులో హల్‌చల్ చేశాడు. మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన ఫెరోజ్ గంజాయి సేవించి మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆగ్రహించిన కాలనీవాసులు యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బల్లార్షా నుంచి వచ్చి గంజాయి సేవిస్తామని, కాగజ్‌నగర్ పట్టణంలో కొందరు తమకు గంజాయి సరఫరా చేస్తారని యువకుడు బహిరంగంగా తెలపడం గమనార్హం.

మురికి నీరు.. కాదు వృథా!

- నాలాల చివరన ఇంకుడు గుంతల నిర్మాణం
- భూగర్భజలాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం
- ప్రతీ పంచాయతీకి ఐదు మంజూరు
- గుంతలకు ఉపాధిహామీ నిధులు



నెహ్రూనగర్‌లో నాలా నుంచి వృథాగా పోతున్న నీరు

కెరమెరి: మురికి నాలాల నుంచి వచ్చే నీరు వృథా పోకుండా, ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సామూహిక ఇంకుడుగుంతల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మురికి నాలాల చివరన ఇంకుడు గుంతలు నిర్మించనుంది. ఇందుకు ఉపాధిహామీ నిధులు ఒక్కో గుంతకు రూ.12 వేల చొప్పున రూ. 70వేల వరకు వినియోగించనుంది. ప్రజలకు సామూహిక ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించింది. ఈనేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో ఎంపీడీవో మహేందర్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య సమావేశం నిర్వహించి ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించారు.

31 జీపీల్లో 155 సామూహిక ఇంకుడు గుంతలు..

మండలంలో మొత్తం 31 పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో జీపీలో 5 సామూహిక ఇంకుడు గుంతల చొప్పున మొత్తం 155 నిర్మించాల్సి ఉంది. ఆగస్టు 31 వరకు పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జనాభా ఆధారంగా ఇంకుడు గుంతలకు ఉపాధి నిధులు కేటాయించనున్నారు. ఒక్కో గుంతకు రూ.12 వేల నుంచి రూ.70 వేల వరకు నిధులు వెచ్చించనున్నారు. 10 కుటుంబాలు ఉన్నచోట ఒక ఇంకుడు గుంతకు రూ.12 వేలు, 20 నుంచి 50 కుటుంబాలు ఉన్నచోట ఒక గుంతకు రూ.70 వేలు వెచ్చించనున్నారు. మురుగునీటి ప్రవాహం ఆధారంగా మురికి నాలా చివరన 1 నుంచి 3 వరకు సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించనున్నారు.

వృథా నీటిని అరికట్టేందుకు..

మురుగునీరు వృథా పోకుండా ప్రభుత్వం సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమం చేపట్టింది. ఇంకుడు గుంతలో నీరు చేరడంతో భూగర్భజల మట్టం పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. కెరమెరిలో ప్రధాన రహదారి పక్కన మురుగుకాల్వలు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. పంచాయతీ వద్ద సరిపడా నిధులు లేకపోవడంతో డ్రెయినేజీ నిర్మాణం జరగడం లేదు. ప్రభుత్వం నాలా నిర్మాణాలకు సైతం నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంతో ఉపయోగం



సామాజిక ఇంకుడుగుంతల నిర్మాణంతో ఎంతో ఉపయోగం ఉంది. నీరు వృథా పోకుండా, భూగర్భ జలం ఇంకిపోకుండా ఉంటుంది. ప్రతీ పంచాయతీలో ఐదు చొప్పున నిర్మించాలి. ఒక్కో గుంతకు రూ.12వేల నుంచి రూ.70 వేల వరకు నిధులు వెచ్చిస్తాం. ఆగస్టు 31 వరకు వీటి నిర్మాణం పూర్తి చేయాలి.

\- మహేందర్, ఎంపీడీవో, కెరమెరి

కేజీబీవీలో బోధనా సిబ్బంది కొరత



దహెగాంలోని కేజీబీవీ

- ఖాళీగా సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ పోస్టులు
- నష్టపోతున్న విద్యార్థినులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

దహెగాం: మారుమూల గ్రామాల్లో బడి మానేసిన, అనాథ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయకపోవడంతో విద్యార్థినులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల ఇక్కడ పని చేస్తున్న సీఆర్‌టీలు బదిలీ కాగా, ఇక్కడి కేజీబీవీలో పని చేసేందుకు బోధనా సిబ్బంది ముందుకు రావడం లేదు.

నలుగురే సీఆర్‌టీలు..

ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై 45 రోజులు కావస్తుంది. మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీలో 6 నుంచి ఇంటర్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. 6 నుంచి 10 తరగతి వరకు 200 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరి కోసం మొత్తం 15 మంది సీఆర్‌టీలు ఉండాలి. కానీ నలుగురు సీఆర్‌టీలు, ఒక్కరు పీజీ సీఆర్‌టీ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. బయోసైన్స్, తెలుగు, ఫిజికల్‌సైన్స్ సీఆర్‌టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థినులకు సరైన విద్యా బోధన జరగడం లేదు. దీంతో విద్యార్థినులు విద్యలో వెనుకబడి పోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలన్నర కావస్తున్నా బోధన సిబ్బందిని నియమించడంలో విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తున్నారు. కేజీబీవీలో పూర్తి స్థాయిలో ప్రవేశాలు జరిగినా విద్యార్థినులకు అనుగుణంగా బోధన సిబ్బంది లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.

పీజీ సీఆర్‌టీ ఒక్కరే..

స్థానిక కేజీబీవీలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నాయి. రెండు గ్రూపుల్లో కలిసి 55 మంది విద్యార్థినులు ఉన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థినులకు బోధించడానికి పీజీ సీఆర్‌టీలు లేరు. కేవలం ఒక్క తెలుగు పీజీ సీఆర్‌టీ మాత్రమే ఉన్నారు. మిగతా 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంటర్ విద్యార్థినులకు బోధించే వారు లేక విద్యార్థినులు తరగతి గదుల్లో ఖాళీగా కూర్చుంటున్నారని తెలుస్తోంది. బోధించే వారు లేక విద్యార్థినులు ఇళ్లకు వెళ్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యార్థినులు కేజీబీవీల్లో చేరాలని అవగాహన కల్పిస్తున్నా ఆ దిశగా పాఠాలు చెప్పేవారిని ఎందుకు నియమించడం లేదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కేజీబీవీలో పూర్తిస్థాయిలో బోధన సిబ్బందిని నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: మండలంలోని ఆయా గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. మండలంలోని జక్కులపెల్లిలో రూ. 5లక్షల జెడ్పీ నిధులతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మిల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సర్పంచ్ పోషయ్య, ఎంపీటీసీ రాము, కోఆప్షన్ సభ్యులు జహురోద్దీన్, ఉప సర్పంచ్ స్వప్న, వార్డు సభ్యులు సతీష్, రేణుక, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, బీఆర్‌ఎస్ నాయకులు పల్లె రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'చారిత్రాత్మక గ్రామాల్లో పని చేయడం అదృష్టం'



విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎస్సై సందీప్‌కుమార్

నార్నూర్: చారిత్రాత్మక గ్రామాల్లో పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని ఎస్సై సందీప్ కుమార్ అన్నారు. శుక్రవారం జైనూర్ మండలంలోని మార్లావాయి గ్రామాన్ని ఆయన సందర్శించారు. స్థానిక సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరావుతో కలిసి ఆదివాసీ ఆరాధ్యదైవం హైమన్ డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ విగ్రహాలకు నివాళులర్పించారు. తొలిసారిగా గ్రామానికి వచ్చిన ఆయనకు హైమాన్‌డార్ఫ్ చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు. అనంతరం పద్మశ్రీ గుస్సాడీ రాజును మార్యాదపూర్వకంగా కలిశారు. రాయిసెంటర్ సార్‌మేడి జుగ్నాక దేవురావు, ఉప సర్పంచ్ సావిత్రి ధర్మేందర్, మాజీ సర్పంచ్ కనక కొద్దు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ప్రభుత్వం'



మాట్లాడుతున్న గణేశ్ రాథోడ్

ఆసిఫాబాద్‌రూరల్: వర్షాలు, వరదలతో ప్రజల ప్రాణాలు పోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పీసీసీ సభ్యుడు గణేశ్‌రాథోడ్ ఆరోపించారు. ఆసిఫాబాద్ మండలంలోని తుంపెల్లి వాగులో ఇద్దరు గల్లంతైన ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. ఉదయం 10 గంటలకు ఇద్దరు వాగులో కొట్టుకుపోతే సాయంత్రం 4 గంటల వరకు రెస్క్యూటీం రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సరైన సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉంటే ఇప్పటికే వారి ఆచూకీ దొరకేదన్నారు. ఆయన వెంట నాయకులు పరుశురాం, తదితరులు ఉన్నారు.

పాఠశాల ఆవరణలో చేపలు పడుతూ నిరసన



చేపలు పడుతూ నిరసన తెలుపుతున్న స్థానికులు

వాంకిడి: భారీ వర్షాల కారణంగా వరద చుట్టుముట్టిన మండలంలోని ఖిరిడి గ్రామ పరిస్థితులు అధికారులకు తెలియజేసేందుకు పాఠశాల ఆవరణలోని వరద నీటిలో స్థానికులు చేపలు పడుతూ నిరసన తెలిపారు. వర్షాల కారణంగా ఇళ్లు, పాఠశాలలోకి భారీగా వరద నీరు చేరిందని, గ్రామానికి రెండువైపులా ఒర్రెలు ఉండగా, వాటిపై వంతెనలు లేక రాకపోకలు నిలిచిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్, డీవైఎఫ్ఐ నాయకులు దుర్గం నిఖిల్, గ్రామస్తులు తిరుపతి, మనోహర్, శ్యామ్ రావు, రాజ్‌కుమార్, శ్రీకాంత్ ఉన్నారు.

పండ్ల తోటల పెంపకంపై గ్రామసభ

వాంకిడి: ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటలు పెంచుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పెందూర్ పవన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖమాన గ్రామపంచాయతీ కేంద్రంలో పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి పోషం, వార్డు సభ్యులు మనోహర్, తిరుపతి, ఈశ్వరబాయి, ఎఫ్ఏ దేవిదాస్, రైతులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

కెరమెరి: కెరమెరి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గుంపుల విజయ్‌ను రాయిసెంటర్ సార్మేడీలు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. కార్యక్రమంలో ఆత్రం బొజ్జిరావు, సాయిసిడాం జంగు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనంద్‌రావు, నాయకులు లక్ష్మణ్, సోము, జలపతిరావు, దుందేరావు, దంబిరావు, ధర్మూ, రాము తదితరులు ఉన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

కెరమెరి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని జోడేఘాట్‌కు వెళ్లే దారిలోని సీసీ రోడ్లు, కల్వర్టులు ధ్వంసమయ్యాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని పోరు గ్రామాల అధ్యక్షుడు పెందోర్ రాజేశ్వర్ కోరారు. శుక్రవారం ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ పెందోర్ మోతిరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయకులు భీంరావు, తుకారం తదితరులు ఉన్నారు.

కూలిన ఇంటి గోడ

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన సంగం గోపాల్‌కు చెందిన ఇంటి గోడ కూలింది. గత వారం రోజులుగా భారీ వర్షాల కారణంగా గోడలు నీటితో తడిచి కూలిపోయినట్లు బాధితుడు వాపోయాడు. కుటుంభ సభ్యులు మరో గదిలో ఉండగా మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా గోడ కూలిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

నేడు ఆదివాసీ దినోత్సవంపై సమావేశం

కెరమెరి: మండలంలోని హట్టి బేస్ క్యాంపులో శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ ఇందిరా తెలిపారు. ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ

వాంకిడి: పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పెంటు తండ్రి చిత్రపటానికి నివాళులర్పించారు.

బీఎస్పీ నాయకులు దొంగ ధర్నాలు మానుకోవాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

బెజ్జూర్: బీఎస్పీ నాయకులు దొంగ ధర్నాలు మాని ప్రజలకు సేవ చేయడం నేర్చుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు జావిద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ పర్వీన్ సుల్తానాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అర్షద్‌హుస్సేన్ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, మాలీ సంఘం జిల్లా నాయకుడు రామకృష్ణ, వెంకన్న, షౌకత్ అలీ ఖాన్, మహేష్, జాహిద్ హుస్సేన్, నందయ్య, బాబురావు, వెంకన్న, భీమన్న, కేశవ్, సాగర్, వెంకటేష్, సురేష్ గౌడ్, అజీమ్ ఖాన్, రమేష్, పెంటన్న పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నవోదయ విద్యాలయంలో నిర్వహించిన కలస్టరల్ లెవల్ గేమ్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ చక్రపాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంగ్వి కల్వర్టుకు మరమ్మతులు



సాంగ్వి కల్వర్టుకు మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

కెరమెరి: భారీ వర్షాల కారణంగా కోతకు గురైన రోడ్లు, కల్వర్టులకు ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. మండలంలోని కర్నెతగూడ, రావుజిగూడకు వెళ్లే దారిలో ఉన్న వాగుపై ఉన్న కల్వర్టుతో పాటు సాంగ్వి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టారు. అనంతరం నిసాని, గోండ్‌గూడ రోడ్లను పరిశీలించారు. సర్పంచ్ జగన్నాత్‌రావు, నాయకులు కుమురం భీంరావు, లాల్‌శావ్, ధర్ము, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జీఎం దేవేందర్‌కు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించి జీఎం(మార్కెటింగ్)గా బదిలీపై వెళ్తున్న దేవేందర్‌ను శుక్రవారం అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు వేర్వేరుగా సన్మానించారు. కైరిగూడ ఓసీపీని సందర్శించిన సమయంలో ఉద్యోగులు, అధికారులు జీఎంను శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో అన్నివిభాగాల ఉన్నతాధికారులు, టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు సన్మానించారు. అధికారులు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో కొత్త గనుల ఏర్పాటుకు దేవేందర్ ఎంతో కృషి చేశారని, ఏరియాను ఉత్పత్తిపరంగా ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. కార్యక్రమాల్లో పీవోలు సత్యనారాయణ, ఉమాకాంత్, డీజీఎంలు సతీష్‌బాబు, ఉజ్వల్‌కుమార్ బెహేరా, రామారావు, బెల్లంపల్లి రీజియన్ డీజీఎం సివిల్ నాగేశ్వర్‌రావు, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్ పాల్గొన్నారు.

కోతకు గురైన అప్రోచ్ రోడ్డు



దహెగాం: దహెగాం -పెంచికల్‌పేట్ మధ్యలో ఉన్న పెద్దవాగు వంతెన వద్ద మట్టితో అప్రోచ్ రోడ్డు నిర్మించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అప్రోచ్ రోడ్డు మొరం కొట్టుకుపోయి కోతకు గురైంది. దీంతో వాహనదారులు ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డుపై ప్రయాణం చేస్తున్నారు. అప్రోచ్ రోడ్డుపై బీటీ వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. శుక్రవారం గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడేలు ఇదే రోడ్డుపై నుంచి ప్రయాణం చేయడం గమనార్హం.

ధ్వంసమైన వంతెనల పరిశీలన



జైత్‌పూర్ బ్రిడ్జి పరిశీలిస్తున్న అధికారులు

వాంకిడి: మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా కోతకు గురైన వంతెనలను జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈఈ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వరద కారణంగా ధ్వంసమైన వంతెనలు, రహదారుల వివరాలు సేకరించి వాటి మరమ్మతుల నిమిత్తం ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఈ అజ్మీర కృష్ణ, ఏఈ స్టీవెన్ ఉన్నారు.